సాక్షి
తిరుపతి
ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



దొంగల ముఠా అరెస్టు
నగరంలో చోరీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు ఏఎస్పీ నాగభూషణరావు తెలిపారు. - IIలో



వైద్య విద్యను కాపాడుకుందాం
కోటి సంతకాల ప్రజా ఉద్యమంతో వైద్యవిద్యను కాపాడుకుందామని మాజీ మంత్రి రోజా పిలుపునిచ్చారు. - IIలో



ముగిసిన యువతరంగ్
ఎస్వీయూలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న యువతరంగ్ కార్యక్రమం శనివారంతో ముగిసింది. - IIలో

న్యూస్‌రీల్

రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి తుడా: దీపావళి పర్వదినం సందర్భంగా సోమవారం స్విమ్స్ ఆస్పత్రి ఓపీ, ఓటీలకు సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. అత్యవసర సేవలు కొనసాగుతాయని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 66,675 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 24,681 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.32 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 12 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టంచేసింది.

అట్టహాసంగా 'దీక్షారంభం'




మాట్లాడుతున్న ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జేవీ రమణ

చంద్రగిరి : శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలోని డైరీ టెక్నాలజీ కళాశాలలో శనివారం సాయంత్రం నిర్వహించిన దీక్షారంభం కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. దీక్షారంభం కార్యక్రమంలో భాగంగా 15 రోజుల పాటు నూతన విద్యార్థులను డైరీ టెక్నాలజీపై క్షేత్రస్థాయిలో వివిధ కార్యక్రమాలను చేపట్టారు. దీంతో పాటు బీటెక్ (డైరీ టెక్నాలజీ) 43వ బ్యాచ్ ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ జేవీ రమణ, ప్రత్యేక అతిథిగా డైరీ సైన్స్ డీన్ డాక్టర్ నాగేశ్వరరావు, అధ్యక్షుడు డాక్టర్ వైకుంఠరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ గంగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ జేవీ రమణ మాట్లాడుతూ.. దీక్షారంభం కార్యక్రమం ద్వారా వ్యక్తిత్వ వికాసం, విద్యా అవకాశాలపై అవగాహన పొందారని పేర్కొన్నారు. 15 రోజుల కార్యక్రమానికి సంబంధించిన నివేదికను విద్యార్థులు వీసీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో ఫ్రెషర్‌డే సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వెటర్నరీ సైన్స్ డీన్ డాక్టర్ ఆర్‌వి. సురేష్ కుమార్, డాక్టర్ శోభారాణి, కళాశాల అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



అలరించిన విద్యార్థుల నృత్యాలు



వసూళ్లు పేలి..

నిబంధనలు తేలి

కాల్చకుండానే టపాసుల ధరలు పేలిపోతున్నాయి. అనుమతుల పేరుతో టపాసుల వ్యాపారుల నుంచి జిల్లాలో కూటమి నేతలు వసూళ్లకు పాల్పడ్డారు. ఇక మేమేం తక్కువా అన్నట్లు అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ అధికారులు నిబంధనల పేరుతో మామూళ్లు లాగేశారు. ఫలితంగా వ్యాపారులు ఆ డబ్బు లోటు పూడ్చుకునేందుకు సిండికేట్‌గా మారిపోయారు. టపాసుల ధరల అమాంతం పెంచి ప్రజల నెత్తి మీద రుద్దేశారు. అధికారులకు మామూళ్లు ముట్టజెప్పడంతో నిబంధనలను గాలికొదిలేశారు.టపాసుల ధరలు ఇష్టారాజ్యంగా పెంచి అమ్మినా..అడిగే అధికారులే కనిపించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.



కూటమి నేతలకు దీపావళి ధమాకా

- టపాసుల దుకాణాల ఏర్పాటుకు నేతల వసూళ్లు
- ఒక్కో షాపు అనుమతికి రూ.25 వేల నుంచి రూ.50 వేలు
- మరో వైపు అగ్నిమాపక, రెవెన్యూ అధికారులకు మామూళ్లు
- టపాసుల బాక్సుల కోసం కూటమి నేతలు ఎవరికి వారు దౌర్జన్యం
- బెంబేలెత్తిపోయిన వ్యాపారులు.. సిండికేట్‌గా ధరల పెంపు

సాక్షి నెట్‌వర్క్ : టపాసుల ధరలు తారా జువ్వల్లా ఆకాశాన్నంటుతున్నాయి. టపాసులు ముట్టుకోకముందే ధరలు పేలుతున్నాయి. దీంతో సామాన్యులకు పెనుభారంగా మారాయి. ఎన్నడూ లేని విధంగా ఈ దీపావళికి టపాసుల ధరలు పెరగడానికి కూటమి నేతలు, అధికారులే కారణమని ప్రజలు మండిపడుతున్నారు.

తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 283 తాత్కాలిక టపాసుల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ వ్యాపారంలో 50 శాతం ఆదాయం ఉండటంతో దుకాణాల ఏర్పాటుకు కూటమి నేతల అనుచరులు, మరికొందరు స్థానికులు పోటీ పడ్డారు. పోటీని దృష్టిలో ఉంచుకుని ఆయా నియోజకవర్గాల్లో కూటమి నేతలు మామూళ్లకు తెర తీశారు.

ఉత్తుత్తి ఎమ్మార్పీలు

టపాసుల బాక్సుపైన ఒక ధర ఉంటే.. విక్రయించేది మరో ధర ఉంటోంది. తిరుపతికి చెందిన కుమార్ అనే వ్యక్తి రూ.5 వేలు ఖర్చు చేసి టపాసులు కొనుగోలు చేస్తే ఐదు పెట్టెల కాకరొత్తులు, మరో ఐదు రకాలు చిచ్చు బుడ్డీలు, మరో మూడు రకాల రెండు రెండు పెట్టెలు వచ్చాయని చెబుతున్నాడు. గతంలో రూ.5 వేలు ఖర్చుచేస్తే పగలు పేల్చే టపాసులు, రాత్రి సమయంలో కాల్చే రకాలు రోజంతా కాల్చినా మిగిలిపోయేవని చెబుతున్నాడు. కూటమి నేతలు, అధికారుల పుణ్యమా అని సామాన్యులు టపాసులు కొనుగోలు చేసే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచ్చలవిడిగా ధరలు పెంచి విక్రయిస్తున్నా, అక్రమంగా విక్రయిస్తున్నా అడిగేవారు లేరు. అంతంత ధరలు పెట్టి కొనుగోలు చేసే టపాసులకు బిల్లులు ఇవ్వకపోవడం గమనార్హం.

భారీగా వసూళ్లు

దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి కావాలంటే ప్రాంతాన్ని బట్టి రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు డిమాండ్‌చేసి వసూళ్లు చేసుకున్నట్లు వ్యాపారులు గూడూరుకు చెందిన వ్యాపారి ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. తిరుపతిలో ఓ ప్రజాప్రతినిధి పేరు చెప్పి ద్వితీయ నాయకుడు ఒకరు టపాసుల వ్యాపారుల నుంచి భారీగా వసూళ్లు చేసినట్లు వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి నేతలకు సమర్పించుకున్న వారికే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు. లేదంటే దుకాణాలకు అనుమతులు ఇవ్వరు. దేవుడు వరమిచ్చారని అంటే కుదరదు.. పూజారి కూడా వరం ఇవ్వాలి. కూటమి నాయకులు లెటర్ ఇచ్చారని సంబంధిత అధికారుల వద్దకు వెళ్తే అక్కడ కూడా దందా సాగుతోంది. అగ్నిమాపక శాఖలో కొందరు, రెవెన్యూశాఖలో మరికొందరు, మున్సిపల్ అధికారులు ఇంకొందరు అనుమతులు ఇవ్వడానికి వసూళ్లకు తెగబడుతున్నారని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరే ఇవన్నీ పూర్తి చేసుకుని ఖర్చు చేసి దుకాణం ఏర్పాటు చేస్తే.. దుకాణాల వద్ద ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు దందా. కూటమిలో మూడు పార్టీల వాళ్లు ఎవరికి వారు బెదిరింపులకు పాల్పడటం, మామూళ్ల రూపంలో టపాసుల బాక్సులు తీసుకెళ్తున్నారు. మరి కొందరు నామమాత్రపు రేటు చెల్లించి తీసుకెళ్తున్నారు.

సిండికేట్‌గా మారి ధరలు పెంచి..

కూటమి నేతల, అధికారుల దబ్బెకు బెంబేలెత్తిపోయిన టపాసుల వ్యాపారులు సిండికేట్‌గా మారిపోయారు. కూటమి నేతల, అధికారులకు మామూళ్ల రూపంలో ఇచ్చిన నగదును రాబట్టుకునేందుకు వ్యాపారులంతా కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో టపాసుల ధరలు అమాంతం పెంచేశారు. సిండికేట్ దెబ్బకు కాల్చకుండానే టపాసులు భగ్గుమంటు పేలిపోతున్నాయి. కూటమి నేతల అనుచరులు ఏర్పాటు చేసిన దుకాణాలకు హంగులు, ఆర్భాటాలతో టెంట్లు ఏర్పాటు చేసి ధరలు పెంచి విక్రయిస్తున్నారు. అందేంటని వ్యాపారులను ప్రశ్నిస్తే.. లైసెన్సు, మామూళ్లకే లక్ష రూపాయల ఖర్చు అయ్యిందని, ఆ డబ్బులు రాబట్టుకోవాలంటే ధరలు పెంచకతప్పట్లేదని చెబుతున్నారు.

రాకెట్ ప్రయోగం మళ్లీ వాయిదా

– నవంబర్ 5వ తేదీకి మార్పు



నవంబర్ 5న ప్రయోగించనున్న జీశాట్-7ఆర్ ఉపగ్రహం

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నవంబర్ 5న సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా జీశాట్-7ఆర్ అనే సమాచార ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. అయితే ఈ ప్రయోగాన్ని ఈనెల 16న చేయాల్సి ఉన్నప్పటికీ కొన్ని సాంకేతిక పరమైన కారణాలతో 25వ తేదీకి వాయిదా పడింది. మళ్లీ 25 నుంచి నవంబర్ 5కి వాయిదా వేశారు. దీనికి తోడు ఈ ప్రయోగంలో అమెరికాకు చెందిన బ్లాక్-2 బ్లూబర్డ్ అనే ఉపగ్రహాన్ని వాణిజ్యపరంగా ప్రయోగించాల్సి ఉన్నప్పటికీ ఉపగ్రహం రావడం ఆలస్యం కావడంతో జీశాట్-7ఆర్ ఉపగ్రహాన్ని ప్రయోగించాలని అనుకున్నారు. ఇందులో కూడా కొన్ని సాంకేతిక కారణాలతో 25న అనుకున్న జీశాట్-7ఆర్ ప్రయోగాన్ని నవంబర్ నెల 5న ప్రయోగించనున్నారని తెలుస్తోంది. 2013 ఆగస్టు 30న ఫ్రెంచి గయానా కౌరూ అంతరిక్ష కేంద్రం నుంచి పారిస్‌కు చెందిన అరైన్-5 రాకెట్ ద్వారా జీశాట్-7 ఉపగ్రహాన్ని ప్రయోగించారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహం కాలపరిమితి అయిపోవడంతో దాని స్థానంలో జీశాట్-7ఆర్ పేరుతో ఉపగ్రహాన్ని పంపనున్నారు.

రేపు విద్యాసంస్థలకు సెలవు

తిరుపతి సిటీ:జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం మాత్రమే దీపావళి పర్వదినానికి సంబంధించి ప్రభుత్వ సెలవు ప్రకటించిందని డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నోములు ఉన్న ఉపాధ్యాయులు స్థానిక అధికారుల అనుమతితో అదనంగా లోకల్ హాలీడేకి అనుమతి పొందాలని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

కూటమి అరాచకాలపై సమరం

- రెడ్‌బుక్ ఆగడాలను డిజిటల్ బుక్‌లో పెడదాం
- ప్రజల తరఫున పోరుకు సిద్ధంగా కమిటీలు
- వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం



మాట్లాడుతున్న ఎంపీ గురుమూర్తి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి : కూటమి అరాచకాలపై ఉద్యమించాలని, రెడ్‌బుక్ ఆగడాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేద్దామని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో శనివారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అన్ని మండలాలు, పట్టణం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ముందుగా గ్రామ, వార్డు, మండల కమిటీల నియామకాలపై వైఎస్సార్ సీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. అక్రమ కేసుల అరెస్టుపై పోరాటం చేసేందుకు జగనన్న సైన్యం సిద్ధంగా ఉండాలని కోరారు. కక్ష సాధింపు చర్యలకు భయపడేది లేదని నిరంకుశ పాలనకు మంగళం పాడే వరకు విశ్రమించబోమని పేర్కొన్నారు. జగనన్న చేసే యజ్ఞంలో మనం క్రియాశీల పాత్రదారులం కావాలని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని బూతు స్థాయిలో నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. టీడీపీ ఎల్లో మీడియా, సోషల్ మీడియా చేస్తున్న గ్లోబెల్ ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాబోయే జగనన్న ప్రభుత్వంలో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యమని జగనన్న మాటగా గ్రామస్థాయిలో తీసుకువెళ్లాల్సిన బాధ్యత మీపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ సిరాజ్ భాష తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన కార్యకర్తలు, నాయకులు, అభిమానులు

ఏర్పేడు ఓవర్ బ్రిడ్జ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- పనులు పరిశీలించిన ఎంపీ గురుమూర్తి



ఏర్పేడులోని వంతెనను పరిశీలిస్తున్న ఎంపీ

ఏర్పేడు : ఏర్పేడు-వెంకటగిరి జాతీయ రహదారి బైపాస్ మార్గం ఏర్పేడు వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్ ఓవర్ బ్రిడ్జ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి సూచించారు. శనివారం ఆయన ఏర్పేడు సమీంలోని రోడ్డు పనులను పరిశీలించారు. ఏర్పేడు ఎల్.సి 36 రైల్వే క్రాసింగ్ కారణంగా ఏర్పేడు-వెంకటగిరి మార్గం వాహనాల రాకపోకలకు రహదారిపై తరచూ ట్రాఫిక్ స్తంభించి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 2023లో రూ. 98.76 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణ పనులు మొదలైనా కాంట్రాక్టర్లు ఇంకా పూర్తి చేయకుండా నత్తనడకన సాగిస్తూ కాలయాపన చేస్తున్నారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ ఐఐటీ, ఐసర్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, అలాగే వెంకటగిరి, రాపూరు ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఏర్పేడు సమీపంలో రైల్వే క్రాసింగ్ వల్ల తీవ్ర అసౌకర్యంగా ఉందని పలువురు తన దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. దీంతోనే తాను ఆగిపోయిన వంతెన పనులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. అనంతరం సంబంధిత జాతీయ రహదారుల ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడిన ఎంపీ బ్రిడ్జ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

పత్రికలపై కక్ష సాధింపు



గూడూరు : సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జర్నలిస్టుల నిరసన

చిల్లకూరు : ప్రజలు, ప్రభుత్వానికి వారధిగా ఉన్న పత్రికలపై ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగడం సమంజసం కాదని గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రజల పక్షాన నిలబడి వార్తలు రాస్తే కూటమి ప్రభుత్వం కేసులు పెట్టి భయపెట్టడం తగదన్నారు. రాష్ట్ర చరిత్రలో ఒక వార్త ప్రచురించారని కక్ష కట్టి సాక్షి ఎడిటర్‌పై కేసులు పెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏఓ శిరీషాను కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాలకు చెందిన జర్నలిస్టులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విహంగాల విహారం



పక్షుల కేంద్రంలో గూడబాతులు

దొరవారిసత్రం: ఆసియా ఖండంలోనే విదేశీ శీతాకాలపు వలస విహంగాలకు అతి పెద్ద సంతానోత్పత్తి కేంద్రంగా బాసిల్లుతున్న నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు విహంగాల ఆగమనం మొదలైంది. దీంతో పక్షుల కిలకిలరావాలు వినిపిస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు నీటితో నిండి ఉంటే ఈ పాటికే అన్ని రకాల పక్షుల విచ్చేసి వాటి పనుల్లో నిమగ్నమై ఉండాలి. కాని ఈ దఫా విహంగాల సీజన్(అక్టోబర్‌లో మొదలై ఏప్రిల్‌లో ముగుస్తుంది) మొదలైనప్పటికీ విదేశీ వలస విహంగాలు సందడి ఆలస్యంగా మొదలైంది. ప్రస్తుతం పక్షుల కేంద్రంలో పదుల సంఖ్యలో పక్షుల్లో రారాజుగా పిలిచే గూడబాతుల(పెలికాన్స్)తోపాటు తెల్లకంకణాయిలు(వైట్ ఐబీస్) వందల సంఖ్యలో నత్తగుల్లకొంగలు విచ్చేసినట్లు స్థానిక వన్యప్రాణి విభాగం సిబ్బంది తెలియజేశారు.

పక్షుల కేంద్రంలో ఈపాటికే...

వర్షాలు సకాలంలో కురిసి ఉంటే పక్షుల కేంద్రం పరిధిలోని అత్తిగుంట చెరువు, నేరేడుగుంట చెరువు, మారేడుగుంట చెరువుల్లో నీరు చేరి ఉంటే వలస విహంగాల్లో ప్రధాన పక్షులు అన్ని ఈ పాటికే చేరి, చెరువుల్లో ఉన్న కడప చెట్లపై చేరి ఆడ, మగ పక్షులు ఒకదాని ఒక్కటి స్నేహం కుదుర్చుకుని పుల్లలతో గూళ్లు కట్టుకుంటూ ఉండాలి. కాని వానలు సక్రమంగా కురవకపోవడంతో వలస విహంగాల సీజన్ ఆలస్యం కాకతప్పలేదు. ఇప్పుడైన పుష్కలంగా వానలు కురవందే వలస విహంగా పూర్తి స్థాయిలో కేంద్రానికి వచ్చే పరిస్థితి ఉండదు. ఇప్పటి వరకు కురిసిన వానలకు చెరువుల్లోకి అరకొరగానే సాగు నీరు చేరాయి. కేంద్రంలో విదేశీ వలస విహంగాలకు పూర్తి స్థాయిలో వాతవరణం అనుకూలిస్తేనే వేల సంఖ్యలో గూడబాతులు, నత్తగుల్లకొంగలు, తెల్లకంకణాయిలు, స్వాతికొంగలు, వందల సంఖ్యలో తెడ్డుముక్కుకొంగలు, నీటికాకులు, బాతుజాతికి చెందిన పలు రకాల పక్షుల విచ్చేసి వాటి వాటి సంతానాన్ని అభివృద్ధి చేసుకోలేవు. స్వదేశీ విహంగాలైన నత్తగుల్లకొంగలు పక్షుల కేంద్రంలోకి గత నెలలోనే వందల సంఖ్యలో విచ్చేశాయి. ఈపక్షుల్లో కొన్ని జత కట్టి పనుల్లో ఉండగా మరి కొన్ని కడప చెట్లపై గూళ్లు కట్టుకునే పనిలో ఉన్నాయి.



నత్తగుల్లకొంగలు



తెల్లకంకణాయిలు

కార్తీకమాసం ప్రత్యేక యాత్ర బస్సులు

- ఏపీ టూరిజం ప్యాకేజీ టూర్ ఏర్పాటు
- డివిజనల్ మేనేజర్ శ్రీనివాసరావు వెల్లడి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : కార్తీక మాసం సందర్భంగా కొత్త ప్యాకేజీ టూర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సి.హెచ్. శ్రీనివాసరావు వెల్లడించారు. ప్యాకేజ్ టూర్ వివరాలు ఇలా.. మహానంది, శ్రీశైలం బస్సు యాత్రకు సంబంధించి ఈనెల 26, నవంబరు 2, 9, 16 తేదీలలో బస్సులు అందుబాటులో ఉంటాయి. ఈ లెక్కన కార్తీక మాసం ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు తిరుపతి నుంచి బస్సు బయలుదేరి సోమవారం మహానంది, శ్రీశైలం దర్శనం చేసుకున్న తర్వాత మంగళ వారం ఉదయానికి తిరుపతికి చేరుకోనుంది. ఒక మనిషి (పెద్దలకు) రూ. 4310, పిల్లలకు (3 నుంచి 10 సంవత్సరాల వరకు) రూ. 3640 (నాన్ ఏసీ రవాణా చార్జీలు, ఫ్రెషప్, భోజన వసతి, గైడ్ సౌకర్యంతో కలిపి) ప్యాకేజీ ధర నిర్ణయించారు. అదే విధంగా కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, తిరువణ్ణామలై యాత్రకు సంబంధించి ప్రతిరోజు బస్సు ఉంటుంది. ఒక మనిషికి పెద్దలకు రూ. 1200, పిల్లలకు రూ. 960 (ఏసీ రవాణా ఛార్జీలు, గైడ్ సౌకర్యంతో) కలిపి ప్యాకేజీ ధర నిర్ణయించారు. అలాగే శబరిమల యాత్రకు, పెళ్లిళ్లకు, ఇతర యాత్రలకు అద్దె ప్రాతిపదికన పంపించే సౌకర్యం ఉంది. మరింత సమాచారానికి తిరుపతిలోని టీటీడీ శ్రీనివాసం, విష్ణునివాసంలోని పర్యాటక కేంద్రాల 9848007033, 9848802099, 9848973985 నంబర్లను లేదా ఏపీటీడీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

జేసీగా మౌర్యకు బాధ్యతలు



తిరుపతి అర్బన్: తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్యకు జాయింట్ కలెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం రాత్రి ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆమె ఇప్పటికే తుడా వీసీగా, తిరుపతి స్మార్ట్ సిటీ ఎండీగా విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం.

టీటీడీలో కొరవడిన పారదర్శకత



మాట్లాడుతున్న శివ కామేశ్వరి శక్తిపీఠం పీఠాధిపతి శివానందస్వామి

తిరుపతి కల్చరల్: టీటీడీలో జవాబుదారీతనం, పారదర్శకత కొరవడిందని శివరామేశ్వరి శక్తి పీఠాధిపతి శివానందస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ భక్తులు కలవాలంటే ముందు అపాయింట్‌మెంట్ తీసుకొని చెప్పినప్పుడు కలవాలని నిర్ణయం చేయడం దుర్మార్గమన్నారు. ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామి తిరుమల స్వామి వారి వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లు పొంది వాటిని డబ్బులకు విక్రయిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని టీటీడీ ఈవో దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈవోను కలిసేందుకు తాము శుక్రవారం వెళ్లడం జరిగిందన్నారు. అయితే ఈవోను కలవాలంటే అపాయింట్ మెంట్ తీసుకోవాలని చెప్పడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వానికి ఈవో వ్యవహార తీరుతో చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో అనిల్‌కుమార్, జయరామిరెడ్డి, డిల్లీ, దీపక్, యజ్ఞేష్ పాల్గొన్నారు.

వైద్య విద్యను కాపాడుకుందాం

- కోటి సంతకాల ప్రజాఉద్యమంతో సాధిద్దాం
- ప్రతి కార్యకర్త కంకణధారుడు కావాలి
- బెల్ట్ షాపులపై ఉన్న శ్రద్ధ.. వైద్య విద్యపై ఎందుకు లేదు?
- సీఎం చంద్రబాబును ప్రశ్నించిన మాజీ మంత్రి ఆర్కే రోజా



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పుత్తూరు: కోటి సంతకాల ప్రజాఉద్యమంతో వైద్య విద్యను కాపాడుకుందామని మాజీ మంత్రి ఆర్కే రోజా పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యను, వైద్యాన్ని అందించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఆయన పాలనలో మొత్తం 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇందులో ఐదింటిని పూర్తిచేసి ప్రారంభించగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈవీఎంల ద్వారా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం జగనన్నకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనని అన్ని మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

బెల్టుషాపులపై ఉన్న శ్రద్ధ.. మెడికల్ కాలేజీలపై లేదా?

గల్లీగల్లీలో బెల్ట్ షాపులు పెట్టడంపై ఉన్న శ్రద్ధ, మెడికల్ కాలేజీలపై ఎందుకు లేదని చంద్రబాబును మాజీ మంత్రి ఆర్కే రోజా నిలదీశారు. వైద్య విద్య ప్రైవేటీకరణను ప్రజాఉద్యంతోనే అడ్డుకోవాలని, దీనికి ప్రతీ వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నాయకుడు కంకణధారుడు కావాలని పిలుపునిచ్చారు. జగనన్న సీఎంగా తీసుకొచ్చిన పలు సంక్షేమ పథకాలను సైతం తుంగలో తొక్కిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తెలిపారు.

'సూపర్‌గా' మోసం!

సూపర్ సిక్స్ పేరిట ప్రతి ఒక్కరినీ మోసం చేశారన్నారు. ఆరోగ్యశ్రీ, చేయూత, ఆసరా వంటి పథకాలను అటకెక్కించారన్నారు. రైతు భరోసా కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, రెండేళ్లకు కలిపి రూ.40 వేలు ఇవ్వాల్సి ఉండగా కేవలం రూ.5 వేలు ఇచ్చి మోసం చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో పబ్లిసిటీ ఎక్కువ పని తక్కువ అంటూ ఎద్దేవా చేశారు.

కోటి సంతకాలతో అడ్డుకుందాం

మెడికల్ కళాశాలల వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంత మేలు జరుగుతుందో ప్రజలకు వివరించి సంతకాలు చేయించాలని మాజీ మంత్రి రోజా సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేయించే కోటి సంతకాల పేపర్లతో జగనన్న మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులతో కలసి వెళ్లి గవర్నర్‌కు అందజేస్తారని తెలిపారు. తద్వారా వైద్య విద్యను ప్రైవేటీకరణ జరగకుండా కాపాడుకొందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎ.హరి, వైస్ చైర్మన్లు డి.జయప్రకాష్, డీ.శంకర్, వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు ఏకాంబరం, రూరల్ పార్టీ అధ్యక్షుడు అన్నా లోకనాథం, ఎంపీపీ మునివేలు, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

– ఆకతాయిలపై కేసు నమోదు

తిరుపతి క్రైమ్: నగరంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ మహిళతో అసభ్యంగా మాట్లాడిన వీడియో వైరల్ కావడంతో ఈస్ట్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన కథనం మేరకు.. కోడూరు సమీపంలోని ఓబుల్‌వారిపల్లికి చెందిన రూపేష్ తిరుపతిలో పోస్టల్ కాలనీలో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వారి బంధువులైన డిగ్రీ చదువుతున్న భరత్, పార్థు సొంత పనుల నిమిత్తం ఆర్టీసీ బస్టాండ్ నుంచి లీలామహల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా కాళ్లు పైకెత్తి వాహనాన్ని అటు ఇటు తిప్పుతూ పక్కన వారిని ఇబ్బంది పెడుతూ వెళ్లారు. ఇంతలో ఓ మహిళకు కాళ్లు తగలడంతో ఆమె ప్రశ్నించింది. అయినా కూడా పట్టించుకోకుండా అలాగే మరో రెండు సార్లు చేశారు. ఎంతకు చెప్పినట్టు వినకపోవడంతో దీని గమనించిన స్థానికులు వాహనాన్ని పక్కన పెట్టించి, ట్రిపుల్ రైడింగ్ ఎలా వెళ్తారు? అందులోనూ మహిళలను ఏడిపిస్తారని వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉంటే పై తెలిపిన ముగ్గురు విద్యార్థులు మాత్రం తమ వర్షం పడుతుంటే నీళ్ల కాళ్లకు తగలకుండా కాళ్లు పైకి ఎత్తుకుని వెళుతున్నామని, అంతలో సమయానికి మమ్మల్ని నడిరోడ్డుపై అందరూ చూస్తుండగా తమపై దాడి చేశారంటూ వాపోతున్నారు. అయితే పోలీసులు మాత్రమే ఈ వీడియోలో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వీరిని తీసుకొచ్చి బాధితురాలు వద్ద ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

దొంగల ముఠా అరెస్టు

– బంగారు నగలు, మోటార్ సైకిళ్లు స్వాధీనం

తిరుపతి క్రైం: నగరంలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు దొంగల ముఠాను క్రైమ్ పోలీసులు అరెస్టు చేసినట్లు క్రైమ్ ఏఎస్పీ నాగభూషణరావు, ఎల్అండ్ఓ రవిమనోహరాచారి తెలిపారు. శనివారం క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎస్.జ్యోతి(32), వి.నందిని(30), ఎ.ప్రియా, (26) ముగ్గురు ముఠాగా ఏర్పడి జిల్లాలోని బస్‌స్టాండ్లు, ప్రయాణికుల గుమికూడే ప్రాంతాల్లో బ్యాగులు చోరీ చేసేవారన్నారు. వీరిపై విశాఖపట్నం, మల్కాపురం, కోడూరు, అలిపిరి, తమిళనాడు ప్రాంతాల్లో పాత కేసులు నమోదై ఉన్నాయన్నారు. అలాగే ప్రకాశం జిల్లాకు చెందిన కొండరాజు రత్తయ్య అలియాస్ రత్తయ్య (29), తిరుపతికి చెందిన కందన్ సాయి అలియాస్ ఆటోసాయి(28) వీరు ముగ్గురు ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడేవారు. వీరిపై తిరుపతి, పుత్తూరు, గాజులమండ్యం, పాకాల, కార్వేటినగరం, కడప, నెల్లూరు జిల్లాలలో పాత కేసులు ఉన్నాయన్నారు. తమ బృందాలు పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి సమాచారం సహకరించామన్నారు. అందులో భాగంగానే మహిళా దొంగలను జైశ్యామ్ థియేటర్ వద్ద, ద్విచక్ర వాహనాలు చోరీలు పాల్పడుతున్న దొంగలను నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్ వద్ద అరెస్టు చేశామన్నారు. వీరి వద్ద నుంచి 5 కేసులకు సంబంధించి రూ.25 లక్షల విలువ చేసే 230 గ్రాములు బంగారు నగలు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో డీఎస్పీలు, సీఐలు ఎంతగానో కృషి చేశారన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ హేమంత్‌రెడ్డి

- కూటమి ప్రభుత్వానికి యువజన, విద్యార్థి సంఘాల హెచ్చరిక

తిరుపతి సిటీ : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని యువజన, విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి. శనివారం వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రీజనల్ కోఆర్డినేటర్ హేమంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక గంధమనేని శివయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నేతలు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు కాసులకు కక్కుర్తి పడి, ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చిన 17 మెడికల్ కళాశాలలో 7 కళాశాలలు నిర్మాణం పూర్తి చేసుకొని, 5 కళాశాలలో అడ్మిషన్లు పూర్తయ్యి, మిగిలిన కళాశాలల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూరే వేసలుబాటు ఉన్నా చంద్రబాబు ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకోవడం దారుణం అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో మంచి పేరు వస్తుందనే ఉద్దేశ్యంతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరిస్తున్నామని, ఇందులో స్వచ్ఛందంగా ప్రజలు భాగస్వామ్యంకావాలని పిలుపునిచ్చారు.

కోటి సంతకాల కార్యక్రమానికి మద్దుతు

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి మాట్లాడుతూ.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు తన బినామీల కోసమే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో తీసుకొస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు రామకృష్ణ, ప్రవీణ్. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు జ్ఞానేంద్ర, నరేష్, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు చెంగల్ రెడ్డి, వినోద్, యశ్వంత్, ఏఐవైఎఫ్ నాయకులు రామకృష్ణ, విక్రమ్, నేషనల్ లా స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుందర్ రాజు, జై భారత్ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు భార్గవ్, పలు విద్యార్థి సంఘాల నేతలు పాల్గొన్నారు.

ముగిసిన యువ తరంగ్



ప్రసంగిస్తున ఆప్స్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



యువ తరంగ్‌లో విద్యార్థుల ప్రదర్శన

తిరుపతి సిటీ : ఎస్వీయూలో మూడు రోజులుగా ఎస్వీ యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చర్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువ తరంగ్ కార్యక్రమం శనివారం ముగిసింది. శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయ భాస్కరరావు మాట్లాడుతూ.. మనిషి జీవన వికాసానికి కళలు మూలాధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడుతూ.. ఎన్నో గొప్ప చారిత్రక సాంస్కతిక కార్యక్రమాలను యూనివర్సిటీ చేపట్టిందని గుర్తు చేశారు. శనివారం శ్రీనివాస ఆడిటోరియం, అన్నమయ్య భవనం, సెనెట్ హాల్ వంటి కేంద్రాల్లో నిర్వహించిన సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ టీవీ మురళీధర్, కల్చర్ అఫైర్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, న్యాయ నిర్ణేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

30న ముగియనున్న సైనిక్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు

తిరుపతి సిటీ: 2026–2027 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు ఈనెల 30వ తేదీ చివరి గడువుని విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడే డాక్టర్ విశ్వనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కోరారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ వంటి మరిన్ని వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రాన్ని సంప్రదించాలని, లేదా 8688888802 /9399976999 నంబరులో సైతం సంప్రదించవచ్చని తెలిపారు. సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో విశ్వం విద్యార్థులు గత కొన్నేళ్ల నుంచి అగ్రగామి సీట్లు సాధిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

మద్యం మత్తులో మీడియా ప్రతినిధిపై దాడి

చిల్లకూరు : తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని బనిగేసాహెబ్ పేట కూడలి వద్ద ముగ్గురు యువకులు స్థానికంగా ఉండే ఓ టీవీ రిపోర్టర్‌పై దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గూడూరు సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదివే ముగ్గురు విద్యార్థులు మద్యం తాగి గురువారం రాత్రి బైక్ నడుపుతుండగా బనిగేసాహెబ్ పేట కూడలి వద్ద అదుపు తప్పి కింద పడిపోయారు. తాగి అంత వేగంగా వెళ్లడం ఎందుకని అక్కడే ఉన్న ఓ టీవీ రిపోర్టర్ వారికి చెప్పే ప్రయత్నం చేశారు. ఈ తతంగాన్ని మీడియా ప్రతినిధి తన సెల్‌ఫోన్‌తో వారిని వీడియో తీసేందుకు ప్రయత్నించగా అతడి సెల్‌ఫోన్ లాక్కుని ముగ్గురు యువకులు మూకుమ్మడిగా మీడియా ప్రతినిధిపై దాడికి తెగబడ్డారు. దీంతో స్థానికులు వారిపై తిరుగుబాటు చేయడంతో మద్యం మత్తులో ఉన్న యువకులు అక్కడ నుంచి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మూడు రోజుల తరువాత స్పందించి యువకులను స్టేషన్‌కు పిలిచి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

తాగి వాహనం నడిపిన 26 మందిపై కేసు

నాయుడుపేటటౌన్ : నాయుడుపేట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 26 మందిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచారు. దీనిపై న్యాయమూర్తి విచారించి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం 26 మందికి రూ.2.60 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ బాబి తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన రుద్రప్రసాద్

చంద్రగిరి : రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి మామండూరు సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిస్సాకు చెందిన రుద్రప్రసాద్(33) ముంగళిపట్టు సమీపంలోని జగనన్న కాలనీలో తాపీ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి రుద్ర ప్రసాద్ మామండూరు వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో కారు ఢీకొనడంతో రోడ్డు పక్కన ఉన్న కాలువలో పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.